క్లుప్తంగా

కనకదుర్గమ్మ ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



పెనమలూరు: గోసాల వైకుంఠపురంలో శ్రీకనకదుర్గమ్మ ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం అందింది. ఆలయ కమిటీ సభ్యుడు ఆకుల వెంకట్రావు, సుశీల దంపతులు సోమవారం రూ. లక్ష విరాళాన్ని ఆలయ నిర్మాణ కమిటీకి అందజేశారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ భక్తులు, దాతల సాయంతో ఆలయం నిర్మాణం చేస్తామన్నారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ఉంగుటూరు: స్థానిక స్త్రీ శక్తి భవనంలో మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు మండల ప్రజాపరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జీవీఎస్వీ శేషగిరిరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ వి.సరోజిని అధ్యక్షతన సమావేశం జరుగుతుందని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు హాజరు కావాలని సూచించారు.

వివాహితను వేధిస్తున్న ఇద్దరిపై కేసు

పెనమలూరు: గంగూరులో వివాహితను వేధిస్తున్న ఇద్దరు వ్యక్తులపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. గంగూరు ఉర్దూ పాఠశాల ప్రాంతంలో కొక్కిలిగడ్డ స్వర్ణ, భర్త ఇసాక్ దంపతులు ఉంటున్నారు. ఇసాక్ వికలాంగుడు. అతనికి గంగూరు సెంటర్‌లో సైకిల్ షాపు ఉంది. స్వర్ణ ఇంటి వెనుక ఇంట్లో నందిపాముల సురేష్‌బాబు ఉంటాడు. అతను స్వర్ణ వెంటపడుతూ వేధిస్తున్నాడు. ఆమె ఇంటికి వచ్చి బెదిరించసాగాడు. అతనికి తోడుగా రవిరాజు అనే వ్యక్తి కూడా వచ్చి బెదిరిస్తున్నాడు. బాధితురాలు తనకు రక్షణ కల్పించి న్యాయం చేయాలని కోరుతూ పోలీసులను ఆశ్రయించింది. వారిద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

పెనమలూరు: యనమలకుదురులో ఆరుగురు పేకాటరాయుళ్లను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురు గణపతినగర్ కరకట్ట ప్రాంతంలో ఆరుగురు వ్యక్తులు పేకాడుతున్నారన్న సమాచారంతో పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. వారి వద్ద రూ 22,460 సొమ్ము స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

ఘనంగా చెన్నకేశవస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు



పెనమలూరు: పోరంకిలోని చెన్నకేశవస్వామి ఆలయంలో సోమవారం షష్టమ బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 11వ తేదీ వరకు ఉత్సవాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా సోమవారం లక్ష్మీగణపతి హోమం, విష్ణు సహస్ర నామపారాయణం, నిత్య హోమం చేశారు. మంగళవారం రాత్రి 7 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవస్వామి కల్యాణ మహోత్సవం ఘనంగా చేస్తారు. భక్తులు పెద్ద సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు.

ఆరోగ్య ఉపకేంద్రానికి కుర్చీల వితరణ



గన్నవరం: కేసరపల్లి శివారు వెంకటనరసింహాపురం కాలనీలోని ఆరోగ్య ఉపకేంద్రానికి వాకర్స్ అసోసియేషన్ ఆఫ్ గన్నవరం శాఖ 15 కుర్చీలను వితరణ చేసింది. సోమవారం ముస్తాబాద పీహెచ్‌సీ డాక్టర్ సంధ్యకు కుర్చీలను వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మడుపల్లి బాలకృష్ణమూర్తి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ రెడ్‌క్రాస్, తలసేమియా నివారణ దినోత్సవం పురస్కరించుకుని కుర్చీలు అందజేసినట్లు తెలిపారు. సంఘ కార్యదర్శి వీసం ప్రసాదరావు, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, హెల్త్ అసిస్టెంట్ దాసరి శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయాల పనితీరు భేష్

గుడివాడ టౌన్: పట్టణ పరిధిలో సచివాలయాల పనితీరు సంతృప్తికరంగా ఉందని గ్రామ, వార్డు సచివాలయాల శాఖ సంచాలకులు డాక్టర్ లక్ష్మీ షా అన్నారు. సోమవారం ఆయన పట్టణంలో 19, 20 వార్డుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సిబ్బంది హాజరు, వివరాలు, వివిధ పథకాల నిర్వాహణలో సిబ్బంది పనితీరు పరిశీలించారు. ఉద్యోగులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. సచివాలయ పరిధిలో లబ్ధిదారుల వివరాలు, వివిధ పథకాలకు సంబంధించిన పోస్టర్‌ల వివరాలు సంతృప్తిని ఇచ్చాయన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు



ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతున్న నర్రా సీతారామారావు



పురుషోత్తపట్నంలో..

లైబ్రరీల్లో వేసవి శిక్షణ శిబిరాలు ప్రారంభం

గన్నవరం: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని అతిథులు చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని ప్రథమశ్రేణి గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభమైంది. దీన్ని గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ నర్రా సీతారామారావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వేసవి సెలవులు వినియోగించుకొనేందుకు ఏపీ పౌరగ్రంథాలయ శాఖ విజ్ఞాన శిబిరాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జూన్ 11వ తేదీ వరకు రోజూ మధ్యాహ్నం 12 గంటల వరకు పుస్తక పఠనం, పుస్తక సమీక్షలు, చిత్రలేఖనం వంటి సృజనాత్మక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. రోటరీక్లబ్ అధ్యక్షులు చిమట రామారావు, విశ్రాంత అధ్యాపకులు గన్నె వెంకట్రావు, గ్రంథాలయ ఇన్‌చార్జ్ దొండపాటి బాబురావు, రామ్‌చంద్రరాజు, బీడీసీ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను వినియోగించుకోండి

కంకిపాడు: గ్రంథాలయాల సేవలు వినియోగించుకోవాలని తహసీల్దార్ టీవీ సతీష్ సూచించారు. సోమవారం నుంచి గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ శిబిరాలు ప్రారంభమయ్యాయి. శిబిరాల బ్రోచర్‌ను తహసీల్దార్ టీవీ సతీష్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 40 రోజుల పాటు వేసవి శిక్షణ శిబిరాలు కొనసాగనున్నాయన్నారు. విజ్ఞానం, వినోదం, వికాసం, శిబిరాల్లో పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి సీహెచ్ రామకృష్ణ, కమిటీ సభ్యులు టి.శేషుబాబు, ఆలపాటి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. తెన్నేరు శాఖ గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమాన్ని గ్రంథాలయ అధికారిణి ఎస్.సునీత పర్యవేక్షించారు.



తెన్నేరు గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

ఉంగుటూరు: మండలంలోని తేలప్రోలు, ఉంగుటూరు, ఆత్కూరు, మానికొండ గ్రామాల్లోని జిల్లా శాఖా గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ శిబిరాలు సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆత్కూరు జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం సుధాకర్, గ్రంథాలయ అధికారులు స్వర్ణలత, కృష్ణారావు, కల్యాణి పాల్గొన్నారు.

గన్నవరంరూరల్: రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రారంభమైన సమ్మర్ క్యాంపును పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ కె.కృపానందం.. గ్రంథాలయ ఉద్యమ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రంథాలయం ఉన్న ఊరు సరస్వతీ నిలయంగా, మేధావుల పుట్టినిల్లుగా విలసిల్లుతుందని చెప్పారు. విద్యార్థులను తీర్చిదిద్దడానికి ప్రభుత్వం చేపట్టిన యజ్ఞాన్ని జయప్రదం చేయడానికి పాఠకులు, గ్రామస్తులు, పెద్దలు సహకరించాలని కోరారు. గ్రంథాలయం అభివృద్ధి కమిటీ సభ్యులు, విద్యార్థులు, బాలలు పాల్గొన్నారు. ముస్తాబాదలో లైబ్రేరియన్ కె.జ్యోతి ఆధ్వర్యాన సమ్మర్ క్యాంప్ ప్రారంభమైంది. అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గోపాలరావు, విజయసారథి, శేషగిరిరావు, కరుణాజీ పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమాన్‌జంక్షన్ గ్రంథాలయంలో చిన్నారులకు వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వాహణాధికారి శ్రీరాముల చిన్నరాజు సోమవారం తెలిపారు. వేసవి సెలవుల సందర్భంగా ఈ నెల 9 నుంచి జూన్ 11వ తేదీ వరకు శిబిరం నిర్వహించనున్నట్లు చెప్పారు. విజ్ఞాన శిబిరంలో కథలు వినటం, పుస్తక పఠనం, పుస్తక సమీక్షలు, పెద్దల నుంచి విన్న అముద్రిత కథలు చెప్పటం, చిత్రలేఖనం, పేపర్ ఆర్ట్, థియేటర్ ఆర్ట్ వంటి సృజనాత్మక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వివరించారు. ఆరు నుంచి 9వ తరగతి విద్యార్థులు శిబిరాలను వినియోగించుకోవాలని కోరారు.

స్పందన సమస్యలపై నిర్లక్ష్యం వద్దు

మేయర్ రాయన భాగ్యలక్ష్మి

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ అందించే మౌలిక వసతుల కల్పనలో ఎలాంటి సమస్యలు లేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను సూచించారు. ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో సోమవారం నిర్వహించిన స్పందనలో నగరవాసుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ స్పందన సమస్యలపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని ఆదేశించారు. నిర్దేశించిన గడువులోగా పరిష్కారం చూపాలని సూచించారు. కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ అధికారులు సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించాలని, గత వారం జరిగిన స్పందనలో వచ్చిన అర్జీలపై అధికారులు నివేదికను తనకు అందించాలని చెప్పారు. స్పందనలో మొత్తం 21 అర్జీలు రాగా అందులో ప్రధానంగా తాగునీటి సరఫరా, డ్రైనేజీ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఇంజినీరింగ్ విభాగం - 12, పట్టణ ప్రణాళిక విభాగం - 4, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యు.సి.డి)- 2, పబ్లిక్ హెల్త్ విభాగం - 3 విభాగాలకు సంబంధించిన అర్జీలు వచ్చాయి. అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి సత్యవతి, చీఫ్ ఇంజినీర్ యం.ప్రభాకరరావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, సిటీ ప్లానర్ జి.వి.జి.ఎస్.వి ప్రసాద్, డిప్యూటీ కమిషనర్ (రెవిన్యూ) డి.వెంకటలక్ష్మి, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యు.సి.డి) శకుంతల, ఎ.డి.హెచ్ శ్రీనివాసు, మేనేజర్ బి.శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు. సత్యనారాయణపురంలోని సర్కిల్ - 2 కార్యాలయంలో పట్టణ ప్రణాళిక విభాగం - 1, చిట్టినగర్‌లోని సర్కిల్ - 1 కార్యాలయంలో పట్టణ ప్రణాళిక విభాగం - 1 అర్జీ రాగా పటమటలోని సర్కిల్-3 కార్యాలయంలో ఎలాంటి అర్జీలు రాలేదని అధికారులు తెలిపారు.



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్

విద్యుత్ విజిలెన్స్ దాడులు

ఉంగుటూరు: తేలప్రోలు సెక్షన్‌లో విద్యుత్ శాఖ ఆధ్వర్యాన నిర్వహించిన దాడుల్లో రూ.5.23 లక్షలు జరిమానా విధించినట్లు విజిలెన్స్ ఈఈ కూన వెంకటేశ్వర్లు తెలిపారు. తేలప్రోలులో గృహ, వాణిజ్య సముదాయాలపై సోమవారం విద్యుత్ విజిలెన్స్ అధికారులు ఆకస్మిక దాడులు చేశారు. గుడివాడ ఈఈ రామకృష్ణ ఆధ్వర్యాన అధికారులు 51 బృందాలుగా ఏర్పడి 3,359 గృహ సర్వీసులు, 126 వాణిజ్య, ఇతర సర్వీసులను 10 తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో 165 సర్వీసులకు అదనపులోడు 128కి.వాట్స్ మొత్తం రూ.5,06,400 జరిమానా విధించారు.

మీటర్ ఉన్నప్పటికీ ఓ వినియోగదారుడు విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నట్లు గుర్తించి రూ.15 వేలు, అనుమతించిన కేటగిరి కాకుండా వేరే కేటగిరిలో ఉన్న వ్యక్తికి రూ.2వేలు జరిమానా విధించారు. విద్యుత్ చౌర్యం జరుగుతున్నట్లు గుర్తిస్తే 9440812362, 9440812363, 8331014951ఫోన్ నంబర్లకు సమాచారం అందించాలని కోరారు. తనిఖీల్లో హనుమాన్‌జంక్షన్ ఏడీఈ బి.శ్రీనివాసరావు, తేలప్రోలు ఏఈ మురళీకృష్ణ, గుడివాడ డివిజన్‌లోని నలుగురు డీఈఈలు, 15మంది ఏఈలు, 27మంది లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్లు పాల్గొన్నారు.



సర్వీసు మీటర్ తనిఖీ చేస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

ఎమ్మెల్యేను కలిసిన డీఎస్పీ



పెనమలూరు: పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథిని గన్నవరం సర్కిల్ డీఎస్పీ ఆర్‌జే జయసూర్య సోమవారం కలిశారు. డీఎస్పీగా జయసూర్య రెండు రోజుల క్రితం గన్నవరం సర్కిల్ బాధ్యతలు చేపట్టారు. దీంతో డీఎస్పీ మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే కార్యాలయానికి వెళ్లి పార్థసారథిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

చేతివృత్తులపై శిక్షణ

పెనమలూరు: విద్యార్థులకు చేతి వృత్తులపై శిక్షణ ఇస్తున్నామని కాప్షు కౌన్సిల్ ఆఫ్ ఏపీ కమిటీ సభ్యురాలు బి.సుజాత అన్నారు. కానూరు వినాయక్‌నగర్‌లోని వాసవ్య చిల్డ్రన్ హోంలో సోమవారం చెరియల్ మాస్కుల తయారీపై శిక్షణ ప్రారంభించారు. సభ్యులు జి.రశ్మి, డి.విజయ్‌కుమార్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యకారుణ్యమూర్తి మహోత్సవాలు



గన్నవరం రూరల్: ఏసుక్రీస్తు ప్రేమ విశ్వమంతా వ్యాపించాలని రెవరెండ్ ఫాదర్ మరియదాసు భక్తులకు సందేశమిచ్చారు. మండలంలోని ముస్తాబాద ఏసు దివ్యకారుణ్య మూర్తి పుణ్యక్షేత్రంలో సోమవారం మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం జపమాల, దివ్య ప్రసాద ఆరాధన, స్వస్థత ప్రార్థనలు చేశారు. రాత్రి రెవరెండ్ ఫాదర్ మాగులూరి ఫ్రాన్సిస్ సమష్టి దివ్యబలిపూజ నిర్వహించారు. విచారణ గురువులు రెవరెండ్‌ఫాదర్ బాలజోసెఫ్ ఆంతోని పర్యవేక్షించారు.

క్రీస్తు మార్గం అనుసరణీయం

గన్నవరం రూరల్: కట్టుబడిపాలెంలో నిర్మించిన నిష్కళంకమాత దేవాలయాన్ని సోమవారం బిషప్ టి.జోసఫ్ రాజారావు ప్రారంభించారు. ఆయన సందేశమిస్తూ ఏసు బోధనలు సర్వమానవాళికి ఆచరణీయమని చెప్పారు. విచారణ కర్తలు రెవరెండ్ ఫాదర్ స్లీవరాజు, ప్రధాన నిర్మాణ కర్తలు రెవరెండ్ ఫాదర్ జ్ఞానానందం తదితరులు పాల్గొన్నారు.

'పెరికీడు'కు వాటర్ ట్యాంకర్ అందజేత

హనుమాన్‌జంక్షన్ రూరల్: వ్యాపార రీత్యా విశాఖపట్టణంలో స్థిరపడిన గ్రామానికి చెందిన ఈర్ల చిన్నారావు ఆయన తల్లిదండ్రులు ఈర్ల సీతారావమ్మ, వెంకటరత్నం జ్ఞాపకార్థం పెరికీడు పంచాయతీకి వితరణగా అందించారు. పంచాయతీ సర్పంచ్ జాన్ ప్రకాష్, కార్యదర్శి దీప్తిలకు దాత ఈర్ల చిన్నారావు సోమవారం వాటర్ ట్యాంకర్‌ను అందజేశారు. గ్రామ అవసరాల రీత్యా వాటర్ ట్యాంకర్‌ను ఏర్పాటు చేయాల్సిందిగా వైస్ ఎంపీపీ పండు రాణి నాగార్జున అడిగిన వెంటనే రూ.3 లక్షల విరాళంతో తయారు చేయించారు. పంచాయతీకి అప్పగించిన దాత చిన్నారావును ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. మాజీ సర్పంచ్ తవ్వా హేమేశ్వర నరసింహామూర్తి, ఉప సర్పంచ్ మజ్జి దీవెనకుమార్, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వెలగపల్లి ప్రదీప్, నక్కా బాబు, ప్రత్తిపాటి జోగేశ్వరరావు, బొడ్డు రంగబాబు తదితరులు పాల్గొన్నారు.



దాత ఈర్ల చిన్నారావును సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు

హజరత్తయ్య గుప్తాకు సేవాభినందన అవార్డు

కంకిపాడు: సామాజిక సేవలో న్యాయవాది హజరత్తయ్య గుప్తాకు ప్రత్యేక స్థానముందని లయన్స్ క్లబ్‌జిల్లా గవర్నర్ దామర్ల శ్రీశాంతి అన్నారు. పట్టణంలోని ఐనా కన్వెన్షన్ హాల్లో ఆదివారం రాత్రి లయన్స్ క్లబ్ 25 జిల్లా వార్షికోత్సవం, సమావేశం నిర్వహించారు. 36 సంవత్సరాలుగా వివిధ రకాల సేవలు అందిస్తున్న సామాజిక సేవకుడు హజరత్తయ్యగుప్తాకు 2022-2023 సంవత్సరానికి సేవాభినందన అవార్డును ప్రదానం చేశారు. కార్యక్రమంలో క్లబ్ అంతర్జాతీయ డైరెక్టర్ చిగురుపాటి వరప్రసాద్.. గుప్తా సేవలు కొనియాడారు. సమావేశంలో 2023-2024 సంవత్సరానికి జిల్లా గవర్నర్‌గా శంకర్‌గుప్తా, మొదటి వైస్‌గవర్నర్‌గా గద్దె శేషగిరి, రెండవ వైస్ గవర్నర్‌గా వి.ఆంజనేయులు ఎన్నికయ్యారు.



హజరత్తయ్యగుప్తాకు అవార్డు అందజేస్తున్న లయన్స్ సభ్యులు

'పది'లో మెరిసిన తాడిగడప 'జెడ్పీ' విద్యార్థులు



తాడిగడప పాఠశాలలో విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పెనమలూరు: తాడిగడప జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్.కనకదుర్గ సోమవారం మాట్లాడుతూ తమ పాఠశాలలో పది ఫలితాల్లో 500 మార్కులకు పైగా సాధించిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించామన్నారు. విద్యార్థిని అశ్వదాటి వరలక్ష్మికి 569 మార్కులు, తమ్ము జ్ఞానేంద్రవర్మకు 553 , కొండా సంగీతకు 547, షేక్‌షమీమున్నీసా 535 మార్కులు, గోగుల మూడా మోహన్‌కు 509 మార్కులు వచ్చాయన్నారు. పాఠశాల నుంచి మొత్తం 76 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవ్వగా 36 మంది పాసయ్యారన్నారు. పేరెంట్స్ కమిటీ సభ్యులు ఎ.బాబూరావు, ఉపాధ్యాయులు పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు.

గన్నవరం రూరల్: నిరుపేద విద్యార్థులను ఉత్తమ విద్యాకుసుమాలుగా తీర్చిదిద్దిన ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డిదని ముస్తాబాద సర్పంచ్ వి.రాధాకృష్ణ, సహకార బ్యాంకు చైర్‌పర్సన్ మేడసాని శ్రీనివాస్ చౌదరి అన్నారు. గ్రామ సచివాలయం వద్ద సోమవారం స్థానిక జెడ్పీహైస్కూల్లో 10వ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించి స్కూల్ ఫస్ట్ వచ్చిన షేక్ ఖాజాబి(567), ద్వితీయ స్థానం సాధించిన మెండా జాన్‌పాల్(565)లను ఘనంగా సత్కరించారు. ఎంపీటీసీ సభ్యులు జి.భాగ్యరాజ్, షేక్ మున్ని, ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ అసిస్టెంట్ జెట్టి నానారావు, షేక్ బాజీ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త డంపింగ్ సమస్యకు చెక్

- రోజూ చెత్త తరలింపు
- స్వచ్ఛాంధ్ర మిషన్ ద్వారా కార్యాచరణ

గన్నవరం: చెత్త డంపింగ్ సమస్యకు చెక్ పెట్టారు. మేజర్ గ్రామపంచాయతీలైన గన్నవరం, కేసరపల్లిలో చెత్త డంపింగ్ సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. ఈ రెండు గ్రామాల్లో సేకరించిన చెత్తను స్వచ్ఛాంధ్ర మిషన్ సహకారంతో విజయవాడ నగరపాలక సంస్థ వాహనంలో గుంటూరులోని జిందాల్ పవర్ ప్రాజెక్ట్‌కు తరలిస్తున్నారు. రెండు నెలలుగా చెత్త తరలింపు ప్రక్రియ విజయవంతంగా జరుగుతోంది. దశాబ్దాలుగా డంపింగ్ యార్డులు లేక ఈ గ్రామపంచాయతీలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తొలిగినట్టే. వీటితో పాటు విజయవాడ రూరల్ మండలంలో జాతీయ రహదారి పక్కనే ఉన్న గ్రామాల్లోని చెత్త తరలింపునకు ప్రత్యేక కార్యాచరణను స్వచ్ఛాంధ్ర మిషన్ చేపట్టనుంది.

టన్నుల్లో చెత్త సేకరణ

గన్నవరం గ్రామపంచాయతీలో రోజుకు ఐదు టన్నుల వరకు చెత్తను సేకరిస్తున్నారు. డంపింగ్ యార్డు లేకపోవడంతో సేకరించిన చెత్తను స్థానిక కోనాయి చెరువు వద్ద ఆర్‌అండ్‌బీ రోడ్డుకు రెండు డంప్ చేస్తున్నారు. దీంతో చెత్త నిల్వలు పెరిగిపోతున్నాయి. కేసరపల్లి గ్రామపంచాయతీకి కూడా డంపింగ్ యార్డు లేక ఏలూరు కాలువ పక్కన రోడ్డుపై డంప్ చేస్తున్నారు. దీనికితోడు విజయవాడ పరిసరాల నుంచి వచ్చే వ్యర్థాలను, వేస్ట్ మెటీరియల్స్‌ను అర్ధరాత్రి వేళ ఇక్కడికి తీసుకువచ్చి డంప్ చేస్తున్నారు. ఇటీవల జాతీయ రహదారి సుందరీకరణలో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇక్కడ గుట్టలుగా పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలను తొలగించారు.

రోజూ తరలింపు

డంపింగ్ యార్డులు లేని కేసరపల్లి, గన్నవరం నుంచి చెత్తను గుంటూరు జిందాల్ పవర్ ప్రాజెక్ట్‌కు తరలించే ప్రక్రియను స్వచ్ఛాంధ్ర మిషన్ ద్వారా చేపట్టారు. రోజూ గ్రామాల్లో సేకరించిన చెత్తను పారిశుద్ధ్య సిబ్బంది ఒక చోటికి చేర్చి అక్కడి నుంచి లిఫ్టర్ వాహనంలో గుంటూరుకు పంపిస్తున్నారు. భవిష్యత్‌లో ఎన్‌హెచ్ పక్కనే ఉన్న గ్రామాల్లో చెత్తను గుంటూరుకు తరలించేందుకు ప్రత్యేకంగా వాహనాన్ని కేటాయించడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ఇదే జరిగితే రామవరప్పాడు నుంచి గన్నవరం వరకు ఉన్న పలు గ్రామపంచాయతీలకు ఉపశమనం కలుగుతుందని అధికారులు పేర్కొంటున్నారు.



గన్నవరంలో చెత్తను వాహనంలోకి లోడ్ చేస్తున్న సిబ్బంది

26 నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): దావు బుచ్చయ్యకాలనీ తొమ్మిదోలైనులోని కల్యాణ వేంకటేశ్వర స్వామివారి దేవాలయంలో ఈ నెల 26వ తేదీ నుంచి 29 వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త అంగలూరి పద్మావతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 26వ తేదీ తెల్లవారుజామున 5 గంటలకు సుప్రభాత సేవతో వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

స్వామివారికి వేదపండితులతో ప్రత్యేక పూజలు అర్చనలు, అభిషేకాలు, 108 కలశాలతో అలంకరణ చేస్తారని తెలిపారు. 27వ తేదీ శనివారం స్వామివారికి విశేషంగా పూజలు, సహస్ర నామార్చనలు చేస్తామని పేర్కొన్నారు. 28వ తేదీ ఆదివారం ఉదయం 8.24 నిమిషాలకు శ్రీదేవీ భూదేవి శిలాబింబాల ప్రతిష్ఠ, మహాపూర్ణాహుతి, కుంభప్రోక్షణ ఉదయం 10.30 గంటలకు స్వామివారి కల్యాణం ఉంటుందని వివరించారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్నదానం చేస్తారని, సాయంత్రం 6 గంటలకు పంచహారతులు, రాత్రి 8 గంటలకు పవళింపు సేవతో వార్షిక బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని పేర్కొన్నారు.

శ్రీశ్రీ కళావేదిక గౌరవాధ్యక్షుడిగా డాక్టర్ శేషుకుమార్

మధురానగర్(విజయవాడసెంట్రల్): అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఉమ్మడి కృష్ణా జిల్లా గౌరవాధ్యక్షుడిగా మాచవరం ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకులు డాక్టర్ కేఆర్‌జీ శేషుకుమార్ నియమితులయ్యారని సంస్థ జాతీయ విభాగం కార్యదర్శి డాక్టర్ వి.ఉమా సరస్వతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలో జరిగిన ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ప్రతినిధుల ప్లీనరీ సమావేశాల్లో సంస్థ అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ చేతులమీదుగా కేఆర్‌జీ శేషుకుమార్‌కు నియామక పత్రం అందజేశారు. ఉమ్మడి కృష్ణా జిల్లా గౌరవాధ్యక్షుడిగా నియమితులైన శేషుకుమార్‌ను జాతీయ కన్వీనర్ కొల్లి రమాదేవి, జాతీయ మహిళా అధ్యక్షురాలు చిట్టే లలిత, రాష్ట్ర అధ్యక్షుడు గుత్తా హరిసర్వోత్తమనాయుడు, సంస్థ ప్రతినిధులు ఈశ్వరీ భూషణ్ , జిల్లా అధ్యక్షుడు జూపూడి రామకృష్ణ, రొంపిచర్ల ఉదయకిరణ్ తదితరులు అభినందించారు.

దత్తసాయి శివకామేశ్వరి పీఠంలో ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ దత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో సోమవారం ధర్మపరిషత్ మహా సంస్థానమ్ ఆధ్వర్యాన నీలకంఠేశ్వరస్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామివారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకులు అవ్వా హేమసుందర వరప్రసాద్ పర్యవేక్షించారు.

రాష్ట్ర స్థాయి రన్నింగ్ పోటీల్లో విశాల్ సత్తా

విజయవాడ స్పోర్ట్స్: రాష్ట్ర స్థాయి సీనియర్ పురుషుల 100 మీటర్ల రన్నింగ్ పోటీల్లో విజయవాడ క్రీడాకారుడు వి.కె.విశాల్ సత్తా చాటాడు. గుంటూరులోని ఏఎన్‌యూ సింథటిక్ ట్రాక్‌పై ఏపీ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఈ నెల ఐదో తేదీన జరిగిన పోటీలకు ఉమ్మడి కృష్ణా జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నాడు. విశాల్ నలంద డిగ్రీ కాలేజీలో డిగ్రీ చదువుతున్నాడు. విశాల్‌ను కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ, పీడీ ఎన్.వెంకటేశ్వరరావు సోమవారం అభినందించారు.



ఇళ్ల నిర్మాణాలపై అవగాహన కల్పించాలి

వెంట్రప్రగడ(పెదపారుపూడి): ఇళ్ల నిర్మాణ పనులపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో ఎం.నాగిరెడ్డి తెలిపారు. మండలంలోని వెంట్రప్రగడ సచివాలయం వద్ద సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ సచివాలయాల వద్ద వలంటీర్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్స్ కలిసి హౌసింగ్ లబ్ధిదారులకు అవగాహన కల్పించి ఇళ్ల పనులు ప్రారంభించేలా చూడాలని ఆదేశించారు. మెటీరియల్ తీసుకున్నా ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించని లబ్ధిదారుల వివరాలు అందుబాటులో ఉంచుకోవాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్స్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.